క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక సదుపాయాలు



పటమట(విజయవాడతూర్పు): నగరంలో నిరంతరం శుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికుల కోసం నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఏకోసిస్టమ్(నమస్తే) నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం తెలిపారు. ఈ మేరకు ఆయన వీఎంసీ అసిస్టెంట్ మెడికల్ అధికారి డాక్టర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. నగరంలోని పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు, ఆయుష్మాన్ కార్డులు అందజేశారని, వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ సోమరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సేవ చేయడం అదృష్టం



పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజాప్రతినిధులైనా, ప్రభుత్వ ఉద్యోగులైనా ప్రజలకు సేవలందించడం అదృష్టంగా భావించాలని 64వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ అన్నారు. ఐదేళ్లకుపైగా డివిజన్లో ప్రజలకు సేవలందించిన వార్డు సచివాలయాల్లో అడ్మిన్లలో బదిలీ అవుతున్న వారికి బుధవారం కార్పొరేటర్ తిరుపతమ్మ వీడ్కోలు పలికారు. వారికి కండువాలు వేసి అభినందించారు. కరోనా సందర్భంలో, వరదలు సంభవించిన సమయంలో మీరు ప్రజలకు సేవలందించిన తీరు అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు ఎంత సేవలందిస్తే అంత మన్ననలను పొందవచ్చన్నారు. 280 సచివాలయం నుంచి బాలు, 281 సచివాలయం నుంచి రాజు, 282 సచివాలయం నుంచి విజయలక్ష్మి, 284 సచివాలయం నుంచి శ్రావణి, 285 సచివాలయం నుంచి శిరీష బదిలీ అయ్యారు. వీరి సేవలను స్థానికులు కొనియాడారు.

యూపీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ తనిఖీలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని కండ్రిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో బుధవారం ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అక్కడ నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకాల కోసం వచ్చిన తల్లీబిడ్డ వద్దకు వెళ్లి ఆమె వద్ద ఉన్న మాతా శిశు కార్డు తీసుకుని బీసీజీ టీకా మొదలుకొని ఇప్పటి వరకూ వేయించాల్సిన అన్ని టీకాలు వేశారో లేదో పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో సేవలు పొందాల్సిన శిశువుల డ్యూ లిస్టును పరిశీలించారు. రోగులకు ఈహెచ్‌ఆర్, ఏబీహెచ్‌ఏ ఐడీలు నమోదు చేస్తున్నారా అని డేటా ఎంట్రీ ఆపరేటర్ వద్దకు వెళ్లి సిస్టమ్‌ను తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణలో ప్రగతి సాధించాలని వైద్యాధికారి ఆదేశించారు. కార్యక్రమంలో సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిహారిక, సూపర్‌వైజర్ పద్మజ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దుర్గాగ్రహారం 11కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం 17వ తేదీ ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చమాంబ స్ట్రీట్, నంబూరు వారి వీధి, అనపర్తి వారి వీధి, అయ్యన్న నాయుడు వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): కార్మిక వాడలోని విద్యుత్ సెక్షన్ పరిధిలో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అధికారులు 38 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 124 కేసులకు గాను రూ.4.08 లక్షలు జరిమానా విధించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ సర్కిల్ సూపరింటెండెంట్ విజయకృష్ణ, గుణదల డీఈ పి.హరిబాబు, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.వి జయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.


ఆహ్లాదానికి తాళం!

- నిరుపయోగంగా కండ్రికలో వీఎంసీ పార్కు
- తెరుచుకోని ట్రయాంగిల్ పార్కు
- ఆట పరికాలు అందుబాటులోకి తేవాలి

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటు చేసిన పార్కులు కాస్తా కూటమి పాలనలో నిరుపయోగంగా మారాయి. పార్కుల నిర్వహణను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. 64వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి సమీపంలో ఉన్న ట్రయాంగిల్ పార్కు, ప్రజాశక్తి నగర్లో కనకదుర్గమ్మ గుడి పక్కన వున్న పార్కుల్లో కనీస సదుపాయాలను కల్పించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆ రెండు పార్కులను రూ. 50 లక్షలతో నిర్మించారు. ఓపెన్ పార్కులుగానే ఉండటంతో కనీస సౌకర్యాలను కల్పించాలని స్థానికులు వీఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వసతులు ఏర్పాటుచేయండి

పిల్లలకు ఊయల, జారుడు బల్ల, జిమ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఉదయం, సాయంత్రం వృద్ధులు, మహిళలు వాకింగ్ చేసుకునేందుకు వాకింగ్ ట్రాక్ సదుపాయం కల్పించాలని అడుగుతున్నారు . కొన్ని రోజులుగా కండ్రిక లోని ట్రయాంగిల్ పార్కు గేట్లు వేసి తాళం వేయడంతో నిరుపయోగంగా ఉంటోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో కనీసం వాకింగ్ చేసుకునేందుకు కూడా వీల్లేక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. పార్కులో గ్రీనరీ అమర్చాలని, పిల్లలకు ప్లేకిట్స్ ను ఏర్పాటు చేయాలని స్థానికులు కార్పొరేషన్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండటానికి సిబ్బంది పర్యవేక్షించాలని కోరుతున్నారు. డివిజన్లో బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలోని పార్కులో రాత్రి సమయాల్లో మద్యం ప్రియులు మద్యం సేవించడం, గంజాయి బ్యాచ్‌లు ఆగడాలు చేస్తున్నాయని పోలీసు గస్తీని ఏర్పాటు చేయాలని కాలనీలో మహిళలు కోరుతున్నారు.



కండ్రికలో తాళం వేసి ఉన్న పార్కు



కనీస సదుపాయాల్లేని పార్కు

ప్రజలకు అందుబాటులో ఉంచాలి



కండ్రికలోని ట్రయాంగిల్ పార్కును వీఎంసీ అధికారులు ఓపెన్ చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలి. పిల్లలకు అవసరమైన ప్లేకిట్స్‌ను ఏర్పాటు చేయాలి.

–మరీదు నగేష్ గౌడ్, కుందావారి కండ్రిక

గ్రీనరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు



కండ్రికలోని ట్రయాంగిల్ పార్కులో మొక్కలు ఏర్పాటు చేసి గ్రీనరీకి ప్రతిపాదనలు పంపాం. చిన్న పిల్లల ప్లేకిట్స్ కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

–చైతన్య, ఏఈ ఉద్యానశాఖ

విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ సారె



అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసిన మహిళా సంఘం ప్రతినిధులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆషాఢం సారెను సమర్పించారు. సంఘ అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి ఆధ్వర్యంలో పలువురు మహిళలు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఆలయానికి చేరుకున్నారు. తొలుత అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తిని దర్శించుకుని పట్టుచీర, పూలు, పండ్లు, పూజా సామగ్రిని సమర్పించారు. సంఘం ఆధ్వర్యంలో 8 ఏళ్లుగా ప్రతి ఏటా ఆషాఢంలో అమ్మవారికి సారెను సమర్పిస్తున్నామని, రాష్ట్రంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అమ్మవారి దయతో పాడి పంటలు, చేతివృత్తులతో అందరూ సంతోషంగా ఉండేలా దీవించమని అమ్మవారిని వేడుకున్నామని శ్రీవాణి తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, సింహాద్రి కనకాచారి, మహిళా సంఘం నేతలు విజయలక్ష్మి, హేమలత, జగదీశ్వరి, చైతన్య, పాల్గొన్నారు.

మధురానగర్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో స్వయంభూ శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్తలు బోయిన గోపాలకృష్ణ మూర్తి, శ్యామల దంపతుల ఆధ్వర్యాన ఇంద్రకీలాద్రిపై కొలువైన లోకమాత దుర్గాదేవికి బుధవారం ఆషాఢ సారె సమర్పించారు. తొలుత శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, గాజులు, వివిధ రకాల స్వీట్లతో దేవాలయంలోని రాజరాజేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణం నుంచి మధురానగర్ పుర వీధులో మేళతాళాలతో అంగరంగా వైభవంగా ఊరేగించారు. అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకుని శ్రీ కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించారు. అనంతరం అమ్మవారి ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి ఆషాఢ సారె తీసుకువెళుతున్న శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్తలు బోయిన గోపాలకృష్ణ మూర్తి , శ్యామల దంపతులు, భక్తులు

మధ్యవర్తిత్వాన్ని వినియోగించుకోండి

విజయవాడలీగల్: మధ్యవర్తిత్వాన్ని వినియోగించుకోవాలని న్యాయమూర్తులు సూచించారు. బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించేందుకు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. న్యాయస్థానాల్లో దశాబ్దాలుగా విచారణలో పేరుకుపోయిన కేసులను సత్వర పరిష్కారం చేసి కక్షిదారులకు న్యాయం చేయాలని సుప్రీంకోర్టు మీడియేషన్, కౌన్సిలేషన్ ప్రాజెక్టు కమిటీ వారి ఆదేశించింది. ఈ ఆదేశాలతో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సూచనల మేరకు ర్యాలీ చేపట్టారు. నగరంలోని కోర్టు కాంప్లెక్స్ నుంచి ప్రారంభమైన ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం మీదుగా తిరిగి కోర్టు కాంప్లెక్స్‌కు ర్యాలీ చేరింది. ఈ సందర్భంగా బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులకు సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ గైడెన్స్ తెలియపరచడం కోసం రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా ఆధ్వర్యంలో ప్రత్యేక సభ నిర్వహించారు.

సెప్టెంబర్ 30 వరకు నిర్వహణ..

ఈ సభలో 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. కోర్టు తీర్పుకి మీడియేషన్ తీర్పుకు చాలా తేడా ఉందని, కోర్టు తీర్పులో ఒక వైపు గెలుపు, మరో వైపు ఓటమి ఉంటుందన్నారు. అదే మధ్యవర్తిత్వంలో అయితే ఇరువురికి విజయం ఉంటుందని తెలియజేస్తూ, ఇది ఎంతో మంచి ఉద్దేశంతో నేషనల్ సర్వీసు అథారిటీ సూచించినందున కక్షిదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 30 వరకు జరుగుతుందని తెలిపారు. సీనియర్ మీడియేషనర్ వేముల హాజరతయ్య గుప్తా, వి.రాజారత్నం, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా బీబీఏ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, 13వ అదనపు జిల్లా జడ్జి డి.శేషయ్య, చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బి.రాధారాణి, 7వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ఎల్ శ్రీనివాసరావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు సాయంత్రం కోర్టు ప్రాంగణం నుంచి ఎంజీ రోడ్డు, పోలీసు కమిషనర్ ఆఫీసు మీదుగా బైక్ ర్యాలీ నిర్వహిస్తూ మీడియేషన్ ఆవశ్యకతను తెలియజేస్తూ నినాదాలు చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

కూటమి మోసాలను ఎండగట్టండి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు



మారుతీనగర్‌లో జరిగిన క్లస్టర్-1 సమావేశంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజలకు అండగా ఉండాల్సిన కూటమి ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారని.. ప్రభుత్వ నయవంచనను క్లస్టర్ సభ్యులు ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. 26వ డివిజన్ మారుతీనగర్‌లో బుధవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం క్లస్టర్-1 సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఆయన డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పథకాలనే పేర్లు మార్చి కూటమి ప్రభుత్వం వారి పథకాలుగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది గడుస్తున్నా ఎన్నికల హామీలను అమలు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. క్లస్టర్ సభ్యులు ప్రజలకు అండగా ఉండటంతో పాటు ప్రభుత్వ తప్పులను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువచ్చి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

చంద్రబాబు మేనిఫెస్టోపై సమాధానం చెప్పాలి

చంద్రబాబు మేనిఫెస్టోపై ప్రజలకు సమాధానం చెప్పాలని మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా పాలన సాగించారని... కానీ చంద్రబాబు ప్రభుత్వం ఏడాది గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బూటకపు కబుర్లతో నెట్టుకొస్తున్నారని విచారం వ్యక్తం చేశారు.

తొలి అడుగు.. సుపరిపాలన ఫెయిల్యూర్

తాము ఇచ్చిన ప్రతీ హామీలను అమలు చేశామని... అధికారంలో లేకపోయినా తాము ధైర్యంగా ప్రజల్లో తిరుగుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం తొలి అడుగు.. సుపరిపాలన ఫెయిల్యూర్ అన్నారు. టీడీపీ నేతలు ప్రజలలోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారన్నారు.

8వేల మందికి ఇళ్లు మంజూరు చేస్తే క్యాన్సిల్ చేశారు

తాము ప్రజలకు అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ ఊదర గొట్టే చంద్రబాబు తమ హయాంలో సెంట్రల్ నియోజకవర్గంలో 8వేల మందికి ఇళ్లు మంజూరు చేస్తే కూటమి ప్రభుత్వం ప్రత్యేక జీఓ తెచ్చి క్యాన్సిల్ చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం 8వేల మందికి రెండు సెంట్ల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాము వారి పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రంలో రౌడీరాజ్యం..

రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తోందని.. అడ్డుకోవాల్సిన పోలీసులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని మల్లాది విష్ణు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు రాష్ట్రంలో శాంతియుత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు కుక్కల అనిత, శర్వాణీ మూర్తి, యర్రగొర్ల శ్రీరాములు, క్లస్టర్-1 అధ్యక్షులు పిల్లుట్ల వంశీ, క్లస్టర్ సభ్యులు, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం త్రివేణి రెడ్డి, సెంట్రల్ నియోజకవర్గం మహిళ అధ్యక్షురాలు తోపుల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి ఫార్మసీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ వర్క్‌షాపు



ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సునీత తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్(ఐపీఏ) సహకారంతో నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల్లో ఈ నెల 21 నుంచి 27 వరకూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఏ సునీత తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం సునీత మాట్లాడుతూ ఔషధ కంపెనీకి, ఔషధ పంపిణీ గురించి లోతైన అవగాహన కోసం జాతీయ స్థాయి నిపుణులతో అధ్యాపకులకు ఈ వర్క్‌షాపులో అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు. ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా సుస్థిరమైన ఔషధ పంపిణీకి నూతన టెక్నాలజీలను, పరికరాలు, వ్యూహాలను ఉపాధ్యాయులకు అందించడంలో సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో ఫార్మాస్యూటిక్స్ విభాగాధిపతి డాక్టర్ జి రమణ తదితరులు పాల్గొన్నారు.

నాసా కాంటెస్ట్‌లో సత్తా చాటిన విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రంజని, మురళీకృష్ణ, పద్మ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నాసా(ఎన్ఎస్ఎస్ఏ) ప్రాజెక్టుల కాంటెస్ట్‌లో రాష్ట్ర స్థాయిలో తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి ప్రతిభ చూపినట్లు అశోక్‌నగర్‌లోని శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ రంజని తెలిపారు. హిలియస్ ఎక్స్‌ట్రాక్షన్‌లో ప్రథమ బహుమతి, హెల్త్ ఇన్ స్పేస్‌లో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను బుధవారం అభినందిస్తూ షీల్డ్ అండ్ గోల్డ్ మెడల్స్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో పాటు, శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం అవసరమన్నారు. ఇది విద్యార్థుల నైపుణ్యాన్ని, అంకిత భావాన్ని తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎకడమిక్ జీఎం మురళీకృష్ణ, ఆర్ఐ పద్మ, కో-ఆర్డినేటర్ చక్రధర్, డీన్ గోపాలరావు, సి- ఇన్‌చార్జి వీరబాబు, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు, నాసా ఇన్‌చార్జి హేమ పాల్గొన్నారు.

విద్యుత్ వాహనాన్ని రూపొందించిన విద్యార్థులు

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో విద్యుత్ వాహనం(ఈ-వెహికల్)ను రూపొందించారు. కాలేజీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం, విజయవాడకు చెందిన బెస్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా ఏపీ3-డే హాండ్స్ ఆన్ ఈ వెహికల్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్క్‌షాపులో తొలుత మెట్‌ల్యాబ్, పవర్ కన్వర్టర్స్, మోటార్‌లు, బ్యాటరీ మోడలింగ్ ఈవీ సిమ్యులేషన్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. చివరిరోజు బుధవారం వర్క్‌షాపు నిపుణుల సహాయంతో ఆరుగురు ప్రయాణించటానికి వీలుగా విద్యుత్ వాహనాన్ని విద్యార్థులు రూపొందించారు. ఈ సందర్భంగా ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ గ్లోబల్ మార్కెట్‌లో విద్యుత్ వాహనాలకు మంచి డిమాండ్ ఉందన్నారు. భవిష్యత్తులో విద్యుత్ వాహనాలు ఆవశ్యకత పెరిగి ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణకు విద్యుత్ వాహనాలు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ వర్క్‌షాపులో వర్క్‌షాప్ రిసోర్స్‌పర్సన్స్‌గా బెస్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ బి.రామాంజనేయులు, కె.వంశీ వ్యవహరించారు.



గంగూరులో విద్యార్థులు రూపొందించిన విద్యుత్ వాహనం

వైఎస్సార్ విగ్రహ తొలగింపు నిర్ణయాన్ని విరమించుకోండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ప్రాంగణంలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అంబటి నాగరాధాకృష్ణ యూనివర్సిటీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. బుధవారం జరిగిన యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో విగ్రహం తొలగింపు విషయం ఎజెండాలో ఒక అంశంగా ఉండటంతో ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వైఎస్సార్ విగ్రహం ఎదుట కొద్దిసేపు నిరసన తెలియజేశారు. వైద్య రంగాన్ని ఎంతో అభివృద్ధి చేయడంతోపాటు, రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహం తొలగింపు సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సాంగా రాజ్‌కమల్, పాలిమెట్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుపై దాడి

పెనమలూరు: విధుల్లో ఉన్న ట్రాఫిక్ హోం గార్డుపై వాహనదారుడు దాడి చేశాడు. ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు అశోక్‌నగర్ టైమ్ ఆస్పత్రి వద్ద ట్రాఫిక్ హోం గార్డు పి.అశోక్ బుధవారం విధులు నిర్వహిస్తునారు. బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి రోడ్డుకు అడ్డంగా బైక్ ఆపటంతో హోంగార్డు అతనిని వెళ్లిపోమని చెప్పాడు. బైక్‌పై ఉన్న వ్యక్తి కొద్ది దూరం వెళ్లి మరల తిరిగి వచ్చి ట్రాఫిక్ హోం గార్డుపై దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన హోం గార్డును ఆస్పత్రికి తరలించారు. బైక్ నంబర్ ఆధారంగా దాడి చేసిన వ్యక్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

వికాస్‌లో 18, 19 తేదీల్లో హెచ్‌ఆర్ కాంక్లేవ్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఈ నెల 18, 19 తేదీలలో హెచ్‌ఆర్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యార్థుల ప్రతిభను పరిశ్రమలకు పరిచయం చేయటానికి, పరిశ్రమలకు కావలసిన నైపుణ్యాలను వివరించి వివిధ రంగాలలోని పరిశ్రమల మౌఖిక పరీక్షలకు తయారు చేయాలనే లక్ష్యంతో దేశంలోని అగ్రశ్రేణి సంస్థల హెచ్‌ఆర్ లీడర్స్‌ను ఆహ్వానిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐటీ, ఎంటర్‌ప్రైజెస్, సొల్యూషన్స్, కన్సల్టింగ్, తయారీ, నిర్మాణం, ఫిన్‌టెక్, హెల్త్‌కేర్, ఫుడ్ అండ్ అగ్రికల్చర్ రంగాలకు చెందిన అగ్రశ్రేణి మేనేజర్లు విద్యార్థులతో ప్రత్యక్షంగా సమావేశమై పరిశ్రమలలోని తాజా ధోరణులపై అవగాహన కల్పించి కళాశాల నుంచి ఉద్యోగం వరకు వారి ప్రస్థానానికి మార్గ నిర్దేశం చేస్తారన్నారు. విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం సాంబమూర్తి రోడ్డులోని శ్రీ అయ్యప్పస్వామి మందిరంలో బుధవారం శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు జరిగాయి. గురుస్వామి బల్లెం పూర్ణయ్య స్వామి.. స్వామివారికి విశేషంగా పంచామృత అభిషేకం అర్చనలు నిర్వహించారు. సాయంత్రం మణికంఠ భజన కార్యక్రమం జరిగింది.

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి



ప్రాజెక్టుల ప్రదర్శనను పరిశీలిస్తున్న కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమ తమ రంగాల్లో వస్తున్న ఆవిష్కరణలపై పట్టు సాధించాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ తెలిపారు. ఆ కళాశాల సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ విద్యార్థులు రూపొందించిన ఆండ్రాయిడ్ ప్రాజెక్టుల ప్రదర్శన ఆ కళాశాల సెమినార్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శనను ప్రారంభించిన చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాపితంగా చాలా వేగవంతమైన ప్రగతి చోటు చేసుకుందన్నారు. ఆ క్రమంలో కంప్యూటర్స్ రంగంలో విప్లవాత్మకమైన అభ్యున్నతి పరుగులు తీస్తోందన్నారు. ఆ రంగానికి సంబంధించిన విద్యార్థులు నూతన ఆవిష్కరణలను తెలుసుకుని వాటికి అనుబంధంగా మరిన్ని నమూనాలను ముందుకు తీసుకు రావాలన్నారు. ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ అక్బర్, నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.